ప్రజాశక్తి

సోమవారం 9 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

దుగ్గిరాల మండలంలో నీటమునిగిన వరి పొలాలు

మళ్లీ వరద ముప్పు

ప్రకాశం బ్యారేజీకి పెరిగిన నీటి ఉధృతి - వీడని ముసురు - కొనసాగుతున్న వర్షాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 10 రోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతూ ముసురు వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో రహదారులన్నీ బురద మయమయ్యాయి. కాల్వకు గండ్లు పడ్డాయి. డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాల్లో చేరిన వరద నీరు బయటకు పోవడం లేదు. ముంపు ప్రాంతాలను పరిశీలనకు వెళు_న్న ప్రజా ప్రతినిధులు అధికారుల వద్ద రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైర్లు మునిగి సర్వం కోల్పోయామని, మళ్లీ సాగు చేయాలంటే అందుకయ్యే పెట్టుబడిని ప్రభుత్వమే ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

మరోవైపు ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద భారీగా పెరిగింది. ఆదివారం రాత్రి 8 గంటలకు ఎగువ నుంచి 4.56 లక్షల క్యూసెక్కులు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 2.60 లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయానికి 2.09 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 2.02 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పులిచింతల దిగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఖమ్మం జిల్లా మున్నేరు వాగుతో పాటు కట్టలేరు ప్రవాహం కూడా కలవడంతో ప్రకాశం బ్యారేజీకి మరో 2.54 లక్షల క్యూసెక్కులు వచ్చి కలవడంతో ప్రకాశం బ్యారేజీకి 4.56 లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

ప్రకాశం బ్యారేజీకి వరద పెరగడంతో కృష్ణ పరివాహక ప్రాంతంలోని లంక భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వచ్చిన వరద నీరు పొలాల్లో తొలగక పోవడంతో

▶ 2లో

సత్రశాలలోని టెయిల్ పాండ్ నుండి విడుదలవుతున్న నీరు

ఉధృతంగా జలాశయాలు

- సాగర్ 24 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
- ఇన్ ఫ్లోగా 2,60,488 క్యూసెక్కులు రాక

ప్రజాశక్తి - విజయపురిసౌత్, రెంటచింతల

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేని వానల కారణంగా ఎగువనున్న జలాశయాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాజెక్టులన్నీ నిండగా మిగతా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నుండి 2,60,488 క్యూసెక్కులను నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వస్తోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు 20 క్రస్ట్ గేట్లను 5 అడుగులు 4 క్రస్ట్ గేట్లను 10 అడుగులు మొత్తం 24 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,18,300 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 588.70 అడుగులవద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 308.1702 టీఎంసీల నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,070 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 8604 క్యూసెక్కులు, ఎడమ కాల్వద్వారా 2114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, లో

▶ 2లో

రాజస్థాన్ నుండి వచ్చి పొన్నూరులో చోరీ

జువెలరీ షాపులో అపహరణ కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు - సొత్తు స్వాధీనం

2లో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

వరద బాధితుల్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

అధిక వర్షాలకు నష్టపోయిన రైతులు, ఇతర పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. రామారావు మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలకు చెరువులు తెగి వాగులు పొంగి కృష్ణానదికి వరదలు వచ్చాయని, జిల్లాలో సుమారు లక్ష ఎకరాల పంట నష్టం వాటిల్లిందని అన్నారు. వరి, పత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, నిమ్మ, కూరగాయలు వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యాపార పంటలకు రూ.2 లక్షలు, వరికి రూ.70 వేలు ఇప్పటికే ఖర్చు పెట్టారని, కౌలురైతులు ముందస్తు కౌలు చెల్లించి పంటలు వేశారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని

▶ 2లో

కలివిడిగా ఉంటూ కడతేరుస్తూ

- అప్పుగా ఇచ్చిన డబ్బులు అడిగితే నూకలు చెల్లినట్టే
- తెనాలిలో సంచలనం రేకెత్తించిన సైనేడ్ హత్యలు
- తీవ్ర భయాందోళనల్లో యడ్ల లింగయ్య కాలనీ వాసులు

అందరితో వారు ఎంతో కలివిడిగా ఉంటారు. మర్యాదగానూ వ్యవహరిస్తారు. మీరు లేనిదే మేము లేం..మేము లేనిదే మీరు లేరు అన్నంతగా భ్రమ కల్పిస్తారు. అదే అదనుగా చేసుకుని వారి వద్ద చాకచక్యంగా అప్పు తీసుకుంటారు. గడువు దాటినా తిరిగిచ్చే అలోచనే ఉండదు. అప్పిచ్చినవారు తిరిగి చెల్లించాలని వారిపై ఒత్తిడి తెచ్చారంటే వారికి భూమ్మీద నూకల చెల్లినట్లే. కుటుంబ సభ్యులకు, పోలీసులకు సైతం అనుమానం రాకుండా సైనైడ్‌తో చంపేస్తారు. అంత చాకచక్యంగా హత్య చేసేది మహిళలే అంటే నమ్మలేని నిజంగా ఉంది. ఇప్పుడు తెనాలి యడ్ల లింగయ్య కాలనీ ప్రజలకు వణుకు పుట్టిస్తున్న కరడు గట్టిన నేరస్తులకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రజాశక్తి-తెనాలి

ఇప్పటి వరకూ తెనాలిలో గంజాయి, మద్యం మత్తులో జరిగిన హత్యలు, రౌడీ షీటర్లు ఆధిపత్యం కోసం జరిగిన హత్యలనే చూశాం. కాని ఇప్పుడు పోలీసులు వెలికి తీసిన హత్యానేరాల్లో కొత్తకోణం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. సాక్షాత్తూ మహిళలు సైనేడ్ ఉపయోగించి హత్యలకు పాల్పడుతున్నారంటే ఎంత తెలివిమీరిపోయారన్నది ఇట్టే అర్థమవుతోంది. సైనేడ్ హత్యలపై జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి చేసిన వివరాలతో స్థానికులు హడలెత్తిపోతున్నారు.

యడ్ల లింగయ్య కాలనీకి చెందిన మహిళ నాగూర్‌బి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పట్టణ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులకు వడ్లమూడి ప్రాంతంలో జూన్ 5న మహిళ మృతదేహం లభ్యం కావటంతో అది నాగూర్‌బి మృతదేహంగా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు సిసి టివి ఫుటేజి, ఆమె కాల్ డేటా ఆధారంగా విచారణ చేపట్టారు. విచారణలో నాగూర్‌బి వద్ద అదే ప్రాంతానికి చెందిన రజని అప్పు తీసుకుంది. తిరిగి

▶ 2లో

దుగ్గిరాల మండలంలో బెండ తోటలోకి చేరిన నీరు

మళ్లీ వరద ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

అల్లాడుతున్నామని, మళ్లీ వరద వస్తే తమకు కోలుకోలేని దెబ్బ తగులుతుందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నీటిని బయటికి పంపేందుకు అవకాశం లేకుండా పోయింది. కాల్వలు, డ్రెయిన్లలో పూర్తిగా నీరు ఉండటంతో పొలాల్లోని నీటిని బయటికి పంపడానికి సాధ్యపడటం లేదు. వర్షాల వల్ల సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు ఏర్పడు తున్నాయి. చిరు వ్యాపారులు విక్రయాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలతో రహదారులన్నీ బురదమయంగా మారడంతో వాహదారులు ఇక్కట్లకి గురవుతున్నారు.

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు గుంటూరు జిల్లాలో వర్షపాతం వివరాలు

తాడేపల్లి 37.6 మిల్లీ మీటర్లు, కొల్లిపర 37.4, తెనాలి 27.2, దుగ్గిరాల 18.8, తాడికొండ 17.4, వట్టిచెరుకూరు 11.8, పెదకాకాని 11.6, మంగళగిరి 10.6, తుళ్లూరు 10.4, కాకుమను 10.2, ప్రత్తిపాడు 9.2, పెదనందిపాడు 8.4, ఫిరంగిపురం 8.2, చేబ్రోలు 7.8, గుంటూరు తూర్పు 6.8, గుంటూరు పశ్చిమ 6.6, మేడికొండూరు 6.6, పొన్నూరు 5.6 మిల్లి మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

వరద బాధితుల్ని ఆదుకోవాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పరుగు మందులు సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని వాగ్దానం చేశారని, ప్రస్తుత పరిస్థితిల్లో వాగ్దానాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాలలోనూ నీటిని తోడించి బ్లీచింగ్ చల్లించాలని, తాగునీటిని క్లోరినేషన్ చేసి వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో ప్రధానంగా గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలని ఆందోళన జరుగుతోందని, 4 మండలాలకు సాగునీరు, తాగునీటి సమస్య తీర్చే గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేయాలని, దీనికి నిధులు కేటాయించాలని అన్నారు. పంట కాల్వలు గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, నల్లమడ వాగులలో తూటుకాడ, గుర్రపు డెక్క తొలిగించాలని, వీటికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ అంశాలపై తీర్మానాలను సమావేశం ఆమోదించింది. వరదల్లో, అధిక వర్షాలకు నష్టపోయిన ప్రజలను మానవతా ధృక్పథంతో విరాళాలిచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, కె.నళీకాంత్, నాయకులు బి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, ఎల్.అరుణ పాల్గొన్నారు.

రూ.1.55 లక్షలు పలికిన వినాయకుని లడ్డు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్: వినాయక చవితి సందర్భంగా మాచర్ల పట్టణంలోని నెహ్రూ నగర్ మెయిన్ రోడ్‌లో 23 సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న వినాయనికి విగ్రహానికి టిడిపి నాయకులు యెనుముల కేశవరెడ్డి దాతగా వ్యవహరిస్తున్నారు. విగ్రహం వద్ద ప్రసాదంగా ఉంచిన 25 కిలోల లడ్డుకు ఆదివారం వేలం నిర్వహించగా రూ.1.55 లక్షలకు టిడిపి నాయకులు యెనుముల కేశవరెడ్డి యూత్ సొంతం చేసుకున్నారు.

రాజస్థాన్ నుండి వచ్చి పొన్నూరులో చోరీ

జువెలరీ షాపులో అపహరణ కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు - సొత్తు స్వాధీనం

అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న సొత్తుతో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -పొన్నూరు

స్థానిక శ్రీతోటమ్మ గుడి సమీపంలోని జ్యువెలరీ షాపులో చోరీ కేసులో ఐదుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 24 కిలోల వెండి వస్తువులు, కారు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వెల్లడించారు. నిందితుల్లో రాజస్థాన్‌కు చెందిన అసోసింగు, అజ్జు అనే ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

పొన్నూరు పట్టణానికి చెందిన అబ్దుల్ సలీం స్థానిక తోటమ్మ గుడి వద్ద జువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున షాపు తాళాలు పగలగొట్టి షట్టరు కొద్దిగా తెరిచి ఉంది. అబ్దుల్ సలీంకు తెలిసిన వారు అతనికి ఫోన్ చేసి షాపులో దొంగలు పడినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు. ఆయన వచ్చి పరిశీలించగా సుమారు రూ.21 లక్షల విలువచేసే 24 కిలోల వెండి వస్తువులు దుండగులు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. చోరీ ఘటన సిసి కెమెరా ఫుటేజ్‌లో రికార్డు అయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజస్థాన్‌కు చెందిన సుమన్ కమతి, మితాలాల్ మాలి, ఉత్తంసింగ్, విక్రందాస్ చరణ్ అనే నలుగురు కలిసి ఇటీవల కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖపట్నం వచ్చి గాజువాకలోని హోటల్‌లో దిగారు. అక్కడి నుంచి ఈనెల 1వ తేదీ తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ వద్ద లాడ్జిలో ఉన్నారు. మీతా లాల్ మాలి బెంగళూరులోని తన పరిచయస్తుడైన పరశురామ్‌ను అడిగి కారును అద్దెకు తీసుకున్నారు. బెంగళూరులోనే ఉన్న అస్సు సింగ్, అజ్జును కారులో ఎక్కించుకొని రావాలని పరసురామ్‌కు చెప్పగా వీరు ఈనెల నాలుగో తేదీన విజయవాడ వచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు పొన్నూరు చేరుకున్నారు. అదేరోజు రాత్రి చోరీ చేయాల్సిన షాపు కోసం నాలుగైదు సార్లు రెక్కీ చేశారు. మరుసటిరోజు తెల్లవారుజామున తోట్లమ్మ గుడి వద్దకు కారులో వచ్చారు. మితాలాల్ మాలి, పరుశురాం, అసు సింగ్ కారులో కూర్చొని గమనిస్తుండగా సుమన్ కమతి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్, అజ్జు షాపు వద్దకు వెళ్లారు. తమ వెంట తెచ్చుకున్న గడ్డ పులుగు, స్క్రూ డ్రైవర్‌ను తీసుకుని షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికెళ్లారు. ఆభరణాలు అపహరించి ఆ బాక్సులను కారులో పెడుతుండగా, కారు ఎదురుగా కొంత దూరంలోఉన్న యువకులు అనుమానంతో వారి వైపుకు వెళ్లబోయారు. ఇది గమనించిన దుండగులు సోరీసొత్తును కారులో వేసుకుని వేగంగా వెళ్లిపోయారు. సుమన్ కమితి, ఉత్తమ్ సింగ్, విక్రం దాస్ చరణ్ కారులో ఎక్కకుండా చీకటిగా ఉన్న ప్రదేశానికి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అర్బన్ సీఐ కె.రవికిరణ్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడ్డారు. సుమన్ కమితి, ఉత్తమ్ సింగ్, విక్రం దాస్ చరణ్ నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌కు వెళుతూ రావి చెట్టు మలుపు వద్ద టిఫిన్ చేయడానికి వెళ్లగా అర్బన్ సీఐ అదుపులోకి తీసుకున్నారు. 6వ తేదీన రాత్రి 10 గంటలకు వీరిని వెంటబెట్టుకుని చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి దగ్గర గాదంకి టోల్ ప్లాజా వద్ద కాపు కాచి మితాలాల్ మాలి, పరశురాం కలిసి దొంగ సొమ్ముతో సహా కారులో ఉండగా అరెస్టు చేశారు. వారి నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని పొన్నూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నిందితులపై పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర, ఉండి, అమలాపురంతో పాటు కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ పలు కేసులు నమోదనట్లు పోలీసులు తెలిపారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : వినాయక విగ్రహ నిమజ్జనానికి సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి మేజర్ కాల్వ వద్ద పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడవ రోజు నుంచి నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. యాల్వీజన్ లైట్లు అమర్చారు.

ఉధృతంగా జలాశయాలు

(మొదటి పేజీ తరువాయి)

లెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తంగా మొత్తం 2,60,488 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు శని, ఆదివారాలు సెలవు కావడంతో ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో ఈ జల అందాలను ప్రత్యక్షంగా చూసేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. హిల్ కాలనీలోని లాంచీ స్టేషన్ వద్ద, పైలాన్ కాలనీలోని కొత్త బ్రిడ్జి, పాత వంతెన, డ్యామ్ ప్రవేశ భాగంలో పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది. డ్యామ్ దిగువ భాగాన పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సంతోషంగా కనిపించారు.

ప్రజాశక్తి - రెంటచింతల : సత్రశాలలో నాగార్జున సాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకున్న గేట్లలో 13 రేడియల్ క్రస్ట్ గేట్లను 3.5 మీటర్లు, ఒక గేటు 3 మీటర్ల మేర ఎత్తి దిగువన ఉన్న పులిచింతలకు 2,48,786 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామన్నారు. నాగార్జున సాగర్ నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : కృష్ణానదికి వరద పెరుగుతుందన్న సమాచారంతో కృష్ణానది ఒడ్డున ప్రాంతాల జనం బిక్కుబిక్కుమంటున్నారు.విపత్తుల నివారణ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. నదీపరివాహక ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను కోరారు. బ్యారేజీ మీద ఆదివారం కూడా వాహనాలను అనుమతించలేదు. ఉండవల్లి సెంటర్ నుంచి బోటుయార్డు మీదుగా వారధి మీదకు ట్రాఫిక్‌ను మళ్లించారు.

కలివిడిగా ఉంటూ కడతేరుస్తూ

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలని నాగూర్‌బి ఒత్తిడి తేవటంతో అమెను అంతమొదించేందుకు వ్యూహం పన్నిన రజిని మరో మహిళ సాయంతో ఆటోలో వడ్లమూడి ప్రాంతానికి తీసుకెళ్లి బ్రీజర్‌లో సైనేడ్ కలిపి తాగించటంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

అదే ప్రాంతానికి చెందిన కఠెవరపు మోషే అనే వ్యక్తి తన భార్యను మద్యం మత్తులో వేధించేవాడు. దీనిని గమనించిన రమణమ్మ అతనిని చంపేస్తే బీమా వస్తుందని, మోషే భార్య భూదేవిని నమ్మబలకింది. అతన్ని కూడా మద్యంలో సైనేడ్ కలిపి ఏప్రిల్‌లో హతమార్చారు. యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, రమణమ్మ తల్లీకూతుళ్లు. భర్తను వదిలేసిన బుజ్జి తల్లి రమణమ్మతో కలిసి కిరాణా షాపు నిర్వహిస్తూ కాలనీలో ఉంటోంది. పోలీసులు తీగ లాగటంతో కానీకి చెందిన రమణమ్మ, వెంకటేశ్వరి, రజిని చేసిన సైనేడ్ హత్యలు వెలుగు చూశాయి. కాలనీకి చెందిన మునగప్ప రజని, మడియాల వెంకటేశ్వరి, గొంతు రమణమ్మలను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు.

తీవ్ర భయాందోళనలో కాలనీ వాసులు

కాలనీ వాసులతో ఎంతో కలివిడిగా ఉండే వెంకటేశ్వరి, రమణమ్మ, రజని హత్యానేరాల్లో నిందితులన్న విషయం కాలనీ వాసులను ఉలికిపాటుకు గురిచేసింది. పైగా మృతికి కారణాలు తెలయకుండా ఉండేందుకు సైనైడ్ కలిపి హత్య చేయటంలో ఆరితేరి పోయారని, ఏడాది కాలంలో నాలుగు హత్యలు చేశారనే పోలీసుల సమచారంతో భయాందోళనలకు గురవుతున్నారు. పైగా మరో ముగ్గురి హత్యకు కూడా నిందితులు పన్నాగం పన్నారని పోలీసులు వెల్లడించిన నేపథ్యంలో వారి ఆందోళన మరింత రెట్టింపయ్యింది. ఇప్పటికే కొందరు స్థానికులు వారికి అప్పు ఇచ్చిన నేపథ్యంలో వెంకటేశ్వరి, రమణమ్మతో ఉన్న సన్నిహిత సంబంధాలను గుర్తు చేసుకుంటున్నారు. వారిని కఠినంగా శిక్షించాలని, తిరిగి వారిని కాలనీలో అడుగు పెట్టకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాకీ చెల్లిస్తామని ఇంటికి పిలిచి డబ్బులు కాజేశారు

షేక్ మీరాబి, యడ్ల లింగయ్య కాలని.

నా వద్ద రమణమ్మ, వెంకటేశ్వరి రూ.50 వేలు అప్పుగా తీసుకున్నారు. డబ్బులు తిరిగివ్వాలని రమణమ్మను చాలా రోజుల తర్వాత అడిగాను. బాకీ చెల్లిస్తాను ఇంటికి రమ్మని పిలిచింది. వెళితే మాటామంతి పూర్తయిన తరువాత టీ ఇచ్చారు. అది తాగగానే నాకేదో ఇబ్బందిగా అనిపించింది. టీ విచిత్రమైన వాసన వస్తుందని అడిగితే, ఆకుతో టీ పెట్టుకుంటామని చెప్పారు. అంతలోనే ఏదో మత్తుగా అనిపించినా అలాగే ఇంటికి వచ్చేశా. నిద్ర లేచి చూస్తే నా దగ్గరున్న రూ.15 వేలు మాయమయ్యాయి. నాకిచ్చిన టీలో ఏం కలిపారో మరి. ఇప్పుడు వారి నిజస్వరూపం తెలిసి నేను కూడా చచ్చి బతికేనేమో అనుకుంటున్నా.

మానాన్నను హత్యచేశారని తెలిసి షాక్‌కు గురయ్యాం

కె.సుబ్బారావు, యడ్ల లింగయ్య కాలని,

మా నాన్న మోషె మద్యానికి బానిస. ఈ ఏడాది ఏప్రిల్‌లో మృతి చెందాడు. మద్యం మత్తులో చనిపోయాడని భావించాం. అయితే తాజాగా పోలీసులు వెల్లడించిన వివరాలతో మద్యంలో సైనేడ్ కలిపి తాగించటంతో మృతిచెందాడని తెలిసి నివ్వెరపోయాం. వాస్తవానికి మా నాన్న మద్యం తాగి మా అమ్మను తిడుతూ ఉంటారు. ఒకసారి రమణమ్మ నడిపించే చిల్లర కొట్టువద్ద కూడా తిడుతుంటే, రమణమ్మతో వాడులాట జరిగిందని తెలిసింది. మా అమ్మను పోలీసులు పట్టుకెళ్లి విచారించటంతో విషయం బయటపడింది. కాలనీలో ఇలాంటివారితో చాలా ప్రమాదకరం. వారిని కఠినంగా శిక్షించాలి.

చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్టు

674 గ్రాములు వెండి, 17.8 గ్రాములు బంగారం, కారు స్వాధీనం

ప్రజాశక్తి - మేడికొండూరు

వ్యసనాలకు బానిసై తగినంత ఆదాయం లేకపోవడంతో, వేరువేరు ప్రాంతాల్లో ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు చోరులను మేడికొండూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం మేడికొండూరు ఎస్ఐ డేవిడ్ రాజు నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టి వివరాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గోగువారి గూడెంకి చెందిన నర్సింగ్ గంగాధర్, నర్సింగ్ మహేష్‌లు, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన చింతా సాయికుమార్, బలుకూరి భీమలింగేశ్వరరావు, నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన జెట్టి కృష్ణ ఐగురు వ్యక్తులు వేరు వేరు ప్రాంతాలలో జరిగిన దొంగతనాలలో ముద్దాయిలుగా ఉన్నారు. వీరిని మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ1.82 లక్షల విలువచేసే 674 గ్రాముల వెండి వస్తువులు, 17. 8 గ్రాముల బంగారు వస్తువులు, షిఫ్ట్ డిజైర్ కార్ లను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. పేరేచర్లలోని సంజీవరావు హోటల్ వద్ద వీరు అనుమానాస్పందంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించామని ఎస్ఐ డేవిడ్‌రాజు తెలిపారు. వీరిపై మేడికొండూరు, పల్నాడు జిల్లా నకరికల్లు, సంతమాగులూరు పోలీస్ స్టేషన్లో దొంగతనాల కేసులు నమోదయ్యాయని తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ , పుల్లూరు డీఎస్పీ పి మల్లికార్జునరావు మేడికొండూరు సిఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టి అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తులో అత్యంత ప్రతిభ కనబరచిన మేడికొండూరు పోలీసు సిబ్బంది, ఎస్సై డేవిడ్ రాజు, పిసిలు జి సిద్దయ్య, కే బాజీ సాహెబ్, కోటయ్య, శ్రీకాంత్, హోంగార్డులు ఎస్ కే జానీ, వెంకటేశ్వర్లును గుంటూరు ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ డేవిడ్ రాజు.. వెనక వరుసలో అరెస్టయిన నిందితులు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

హత్య చేశారని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - వినుకొండ

రామావత్ రవి నాయక్ (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన బొల్లాపల్లి మండలం కనుమలచెరువు పంచాయతీ బ్రిడ్జి తండా వద్ద శనివారం వేకువ జామున జరిగింది. మండలంలోని గండిగముల గ్రామానికి చెందిన రామావత్ రవి నాయక్ (35) బ్రిడ్జి తండా వద్ద నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్ లో గల్లంతై ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం సిద్దినపాలెం వద్ద సాగర్ మెయిన్ కెనాల్ లాక్ వద్ద ఆదివారం ఉదయం మృతదేహం లభ్యమైనది. సమాచారం తెలుసుకున్న బండ్లమోటు ఎస్సై బాలకృష్ణ సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని మెయిన్ కెనాల్ నుండి వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాల తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని రామావత్ రవి నాయక్ మృతికి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతునికి భార్య అంజలి భాయ్, ఏడాదిన్నర కుమారుడు కలరు.

నా భర్తను హత్య చేశారు..

తన భర్త రామావత్ రవి నాయక్‌ను హత్య చేసి సాగర్ కాల్వలో పడేశారని మృతుని భార్య అంజలి భాయ్, తల్లి మంగా భాయ్, సోదరుడు కొండయ్య నాయక్ ఆరోపిస్తున్నారు. రమావత్ రవి నాయక్ వినుకొండలో ఒక ప్రైవేటు సంస్థలో పనిచేసుకొని రోజు ద్విచక్ర వాహనంపై ఇంటికి వచ్చేవాడని తెలిపారు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెల్లటూరు నుండి బ్రిడ్జి తండా మీదగా గండి గనుమల వస్తుండగా వడితే రవి నాయక్‌తో ఒక మహిళ, మరో వ్యక్తి కలిసి మార్గమధ్యంలో అటకాయించి హత్య చేసి తన భర్త వద్ద ఉన్న 15000నగదు, బంగారు ఉంగరం దొంగిలించి మృతదేహాన్ని నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ లో పడవేశారని ఆరోపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు బండ్లమట్టు పోలీసులు విచారణ చేపడుతున్నారు. నిందితులు పలారిలో ఉన్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

విద్యుత్ షాక్ కు గురై గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ల లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ముప్పాళ్ల గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మయ్య (50) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా యాదవ బజారులో వినాయక విగ్రహానికి మండపం ఏర్పాటు చేశారు. ఆ మండపానికి విద్యుత్ లైటింగ్‌తో అలంకరించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో మండపానికి విద్యుత్ లైటింగ్ ఉండడం వలన విద్యుత్ ప్రసరించి మండపం వద్ద ఉన్న పలువురికి స్వల్పంగా విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ షాక్ తగులుతుందనీ గమనించిన మండపం వద్ద ఉన్న వారు వెంటనే మండపం నుంచి కిందకు దిగగా లక్ష్మయ్య పక్కనే ఉన్న మండపానికి ఏర్పాటు చేసిన ఇనుప పోల్‌ను పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనతో గ్రామంలో విషాధచాయలు ఆలుముకున్నాయి. మృతునికి భార్య నాగేశ్వరి, కుమార్తెకు వివాహం కాగా కుమారుడు శివ నవీన్ ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఎలుకల పేస్ట్ తిని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనలో సత్తెనపల్లి కంటెపూడికి చెందిన అద్దంకి బ్రహ్మయ్య (35) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య సౌజన్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణలో లస్కర్ మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

విధి నిర్వహణలో ఉండి, చిలకలూరిపేట మేజర్ కాలువలో పడి లస్కర్ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం లింగంగుంట్ల కాలనీకి చెందిన మల్ల లక్ష్మయ్య (51) చిలకలూరిపేట మేజర్ కాలవ పైన దేచవరం నుండి గార్లపాడు వరకు లస్కర్ గా పనిచేస్తుంటాడు. ఈనెల 6వ తేదీన డ్యూటీ కి వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఆదివారం నరసరావుపేట మేజర్ కాలువలో శవంగా కనబడ్డాడు. డ్యూటీలో ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయి ఉంటాడని మృతిని భార్య కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు.

కాలనీలో నీళ్లు నిలబడకుండా చూడాలి

ప్రజాశక్తి - పెదకాకాని

వర్షానికి ముంపుకి గురైన పెదకాకాని మండలం సుందరయ్య కాలనీలో ఎన్ఆర్‌జిఎస్ రాష్ట్ర డైరెక్టర్ వీకే సన్మకు, డిపిఒ శ్రీదేవి పర్యటించి అక్కడున్న ప్రజలతో మాట్లాడి ప్రజల సమస్యలు తాగునీరు, ఇతర సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ సుందరయ్య కాలనీ ముంపుకి గురి అవటానికి ప్రధాన కారణం నేషనల్ హైవే అథారిటీ వారు హైవే కిందగా కల్వర్టు ద్వారా నీరు పోయే తూములు పూడ్చి వేశారని వర్షం పడినప్పుడు వెనిగండ్ల వెంగళరావు నగర్ ప్రాంతాల్లో వాటర్ 50 అడుగులు వెడల్పున చెరువులోకి ఒకసారిగా చేరుతుందని చెరువులో నుండి వాటర్ బయటకు పోయే కల్వర్టు మూడు అడుగులు వెడల్పు మాత్రమే ఉందని దీనివలన నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. కల్వర్టు లెవల్‌కి మించి ఎత్తుగా నిర్మించడం వల్ల ముంపునకు గురవుతున్నాయని వికేసన్మకు దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్ఆర్‌జిఎస్ రాష్ట్ర డైరెక్టర్ సన్మకు మాట్లాడుతూ తక్షణమే కాలనీలో నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టాలని నేషనల్ హైవేకు ఉన్న కల్వర్టు హైటు తగ్గించాలని కాలనీలో రోడ్లు నిర్మించాలని, ఎండిఓ మల్లేశ్వరరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజా రత్నంకి ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు వీలైనంత క్వాలిటీగా ఫిల్టర్ చేసి ఇవ్వాలని, వ్యాధులు రాకుండా బ్లీచింగ్, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మూడు చెరువుల కట్టలు తెగిపోయాయని, డైరెక్ట్‌గా గుంటూరు ఛానల్ నుండి వచ్చే వాటర్ ఫిల్టర్ చేసి ఇస్తున్నామని చెప్పారు.

వరద ప్రభావిత ప్రాంతాలు పరిశీలించిన పెమ్మసాని

ప్రజాశక్తి గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం పర్యటించారు. నీటమునిగిన పొలాలను పరిశీలించారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ క్రాప్ నమోదు చేయని వారికి వారం రోజుల్లోగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పెదకాకాని పొన్నూరు, వట్టి చెరకూరు మండలాల్లో అయన నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కౌలురైతులకు కూడా న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం ప్రతిపాడు నియోజకవర్గంలోని ముట్లూరు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని పరిశీలించారు. రైతులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ ఆయన వెంట ఉన్నారు.

330 మందికి కిట్లు అందజేత: సిఎస్ఆర్ నిధుల కింద పెమ్మసాని నేతత్వంలో ముందుకొచ్చిన ఇండస్ టవర్స్ లిమిటెడ్ సంస్థ, వరద ప్రభావిత ప్రాంతమైన సుందరయ్య కాలనీలో దుప్పట్లు చీరలు లుంగీలు టవల్స్‌తో కూడిన ఒక్కో కిట్ చొప్పున 330 మందికి కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాల్ల నరేంద్ర, ఇండస్ టవర్స్ లిమిటెడ్ సీఈవో గంటా దిలీప్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను 4-5 రోజులుగా పర్యటిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. వరద బాధితులకు సమయానికి పాలు అందుతున్నాయి అంటే అది ధూళిపాళ్ల నరేంద్ర వంటి నాయకుడు అందుబాటులో ఉండబట్టే సాధ్యమైందని అన్నారు. వరద బాధితులకు అవసరమైన దుస్తులు తదితర సంబంధిత కిట్స్ అందజేస్తున్న ఇండస్ట్ టవర్స్ నిర్వాహకులకు ఈ సందర్భంగా పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

కోర్టు వారి నోటీసులు
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి. అద్దంకి వారి కోర్టులో
E.P. No: 11/2023
IN
O.S.No:16/2021
Between :
అడ్డగడ మల్లిఖార్జున రావు ....డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీరంగం నల్లన్ చక్రవర్తి సుగంధ .. జె.డి.ఆర్
To
జె.డి.ఆర్ : శ్రీరంగం నల్లన్ చక్రవర్తి సుగంధ భర్త శ్రీనివాస్, డి. నం. 1-41-3, కొల్లురివారి వీధి, నాజర్‌పేట, తెనాలి టౌన్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా.
జె.డి.ఆర్ అయిన మీపై డి.హెచ్.ఆర్ అయిన అడ్డగడ మల్లిఖార్జునరావు అనువారు, మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, అద్దంకి వారి కోర్టులో, ఈ.పి. నం. 11/2023 ఇన్ ఒ.యస్. నం. 16/2021, ఈ.పి. పిటిషను వేయగా. జె.డి. ఆర్ అయిన మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపినను తీసుకోనకుండా కాలయాపన చేయు చున్నదున. కోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారిచేయమని ఉత్తర్యులు ఇచ్చి యున్నారు. కావున తేది: 16-10-2024 న ఉదయం గం: 10-30 ని.లకు మీరు స్వయంగా గాని లేక, మీ తరుపున న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు ఏమైనా అక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకోనవలయును. లేని యడల సదరు పిటిషనును మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయదమైనది.
వాయిదా తేది: 16-10-2024
అద్దంకి ఇట్లు
తేది :06-09-2024 పి.సతీష్
డి.హెచ్.ఆర్.తరుపు అడ్వకేట్,
అద్దంకి.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్డి వారి కోర్టులో
I.A No : 121/2024
IN
O.S No : 123/2015
గుంటుపల్లి యల్లమందరావు .... పిటీషనర్/ వాది
Vs
గుంటుపల్లి కోటయ్య వగైరాలు
.....రెస్పాండెంట్లు /ప్రతివాదులు
NOTICE
R6) గుంటుపల్లి గౌతమి
W/o లేటు ఆదినారాయణ, చాకలివారి వీధి, పోలిరెడ్డి పాలెం, చిలకలూరిపేట మండలం.
R7) గుంటుపల్లి నాని
S/o లేటు ఆదినారాయణ
R8) గుంటుపల్లి వేదాంత్
S/o లేటు ఆదినారాయణ, పోలిరెడ్డి పాలెం, చిలకలూరిపేట మండలం,
R9) గుంటుపల్లి కామేశ్వరమ్మ
W/o లేటు కోటయ్య, ప్రస్తుతం. చిలకలూరిపేట పల్నాడు జిల్లా.
పిటిషనర్ మీపై దావా షెడ్యూలు దాఖలా ఆస్తులను O.S. No: 123/2015 లో ఇచ్చిన ప్రిలిమనరి డిక్రీ ప్రకారం బాగా పంపిణీ చేసి తనకు రావలసిన వాటా ఆస్తిని తనకు ప్రత్యేకముగా ఇప్పించమని కోరుచూ పై నంబర్ పిటిషన్ దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం 28-10-2024 వ తేది కి వాయిదా వేయబడినది. కావున ఆరోజు ఉదయం 10.30 ని.లకు పై కోర్టు ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమందు కోర్టు వారు ఉత్తర్వులు ఇవ్వగలరు.
// కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం,
పిటిషనర్ తరపు న్యాయవాది,
అద్దంకి

వరద బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలి

జిల్లా వ్యాప్తంగా సేకరించిన రూ.1.24 లక్షలు సిపిఎం పీపుల్స్ రిలీఫ్ ఫండ్‌కు జమ

సిపిఎం పల్నాడు కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు మానవతా దక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సిపిఎం రొంపిచర్ల శాఖ నుండి సేకరించిన రూ 29,500తో పాటు జిల్లా వ్యాప్తంగా విరాళంగా సేకరించిన రూ.94,500 వేలు కలిపి మొత్తం రూ.1.24 లక్షలు సిపిఎం పీపుల్స్ రిలీఫ్ ఫండ్‌కు జమ చేశామన్నారు. విపత్కర పరిస్థితుల్లో విరాళం అందజేసి వరద బాధితులను ఆదుకునే నైతిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విజయవాడ ఎంబివికె భవన్ ఆధ్వర్యంలో వరదలు వచ్చిన మొదటి రోజు నుండి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం పొట్లాలు, పాలు, పెరుగు అల్పాహారం పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద వరద బాధితులను ఆదుకునేందుకు కమిటీ సభ్యులు విరాళం సేకరణకు కృషి చేయాలని కోరారు. నరసరావుపేట నియోజకవర్గంలో విరాళం సేకరించిన వారిలో సిపిఎం పట్టణ శాఖ నాయకులు సిలార్ మసూద్, మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, ఆంజనేయులు, రొంపిచర్ల శాఖ నాయకులు కె.రామారావు, ఎస్.వెంకటేశ్వరరాజు, పికె.శ్రీనివాసరాజు, టి.పెద్దిరాజు, బత్తుల బాలకోటయ్య పాల్గొన్నారు.

మాచర్లలో నేడు మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మాచర్ల పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా జరగనుంది. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు మొదలు కానున్నాయి. రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, శ్రీ విజయ బయోఫెర్టిలైజర్స్, కృష్ణ ఫుడ్స్ ప్రొడక్ట్స్ సంస్థల్లో కష్టమర్స్ సర్వీస్ అసోసియేటీవ్స్, సేల్స్ రిప్రజెంటేటివ్స్, గ్రూప్ లీడర్స్, టీమ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరగనున్నాయి. మొత్తం 140 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివినవారు ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం కిరణ్ : 7842747682, శ్రీకాంత్ : 9492158153 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేద విద్యార్థినికి బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతిభ కలిగి పేదరికం కారణంగా ఏ పేద విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని, అటువంటి పేద విద్యార్థులు సహాయం కోసం దరఖాస్తు చేసుకుంటే తమ ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం చేస్తామని బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ట్రస్ట్ ఛైర్మన్ బివి కృష్ణారావు అన్నారు. కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి ఏడాది విద్యార్థిని అయిన నరసరావుపేట పట్టణానికి చెందిన కాసా ఉదయలక్ష్మికి ట్రస్ట్ తరపున రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే ఎంతోమంది విద్యార్థులకు సాయం చేశామని కృష్ణారావు చెప్పారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, కె.నాసరయ్య, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రవంక ప్రవాహానికి వ్యర్థాల గ్రహణం

- అక్విడెక్టు కానాలకు అడ్డు పడిన గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు
- జమ్మలమడక రహదారి మీదుగా వరద నీరు

గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు అడ్డుపడటంతో జమ్మలమడక రహదారిపై ప్రవహిస్తున్న నీరు

చంద్రవంక అక్విడెక్టు కానాలకు అడ్డుపడిన గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం మీదుగా ప్రవహించే చంద్రవంక వాగులో 15 ఏళ్లుగా నీటి ప్రవాహం అంతగా లేకపోవటంతో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు పెరిగాయి. అయితే ఇటీవల భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయితే వాగు బ్రిడ్జి కానాలకు పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క అడ్డుపడుతుండడంతో వరద నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. రెండ్రోజుల క్రితం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఈ ప్రదేశాన్ని పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చంద్రవంక చుట్టుపక్కల ఆక్రమణలపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. అప్పటికే మున్సిపల్, రెవెన్యూ అధికారులు మాచర్ల పట్టణంలో చంద్రవంకపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిల వద్ద ప్రొక్లయిన్లతో ఆటంకాలను తొలగించారు. అయితే మాచర్లకు కిలో మీటర్ దూరంలో జమ్మలమడక రహదారిలో ఉన్న చంద్రవంక అక్విడెక్టు (నాగార్జునసాగర్ కుడి కాల్వ వంతెన) వద్ద తొలగింపులేమీ చేపట్టకపోవటతో అక్విడెక్టుకు ఉన్న 6 కానాల్లో రెండు కానాలకు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు అడ్డుపడుతూ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి జమ్మలమడక రహదారిపై ప్రవహిస్తోంది.

వాస్తవంగా ఈ రహదారి కూడా 6 కానాలలో ఒక కానా అయితే ఇది ఎత్తు ఎక్కువుగా వుండి చంద్రవంక వాగుకు కట్టలాగా ఉంటుంది. చంద్రవంకలో అధికంగా వరద వచ్చినప్పుడు ఈ కానా గుండా కూడా నీరు ప్రవహిస్తుంది. ఈ చంద్రవంక అక్విడెక్టు 60 ఏళ్ల కిందట మాచర్ల మునిగిపోవటానికి కారణమైంది. చంద్రవంక వాగు పైనుండి నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రవహించే విధంగా చంద్రవంక అక్విడెక్టు నిర్మాణం జరుగుతున్న దశలో చంద్రవంక పొంగి పొర్లింది. 33,750 క్యూసెక్కుల నీరు ప్రవహించే సామర్థ్యంతో నిర్మాణంలో ఉన్న అక్విడెక్టు కానాలకు గుర్రపుడెక్క, గడ్డిమోపులు, పిచ్చిమొక్కలు అడ్డుపడి చంద్రవంక ప్రవాహాన్ని అడ్డుకుంది. దాంతో వరద నీరు వెనక్కి తన్ని మాచర్లను ముంచి వేసింది. ఈ వరదలో వంద మందికి పైగా చనిపోయారు. అంతటి ప్రమాదాన్ని సృష్టించే అక్విడెక్టు వద్ద చంద్రవంక నీటి ప్రవాహానికి ఆటకం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి తోడు ప్రతిరోజూ మాచర్ల చుట్టపక్కల ప్రాంతాల్లో వర్షాలతో చంద్రవంక ఉధృతంగా ప్రవహిస్తోంది. మాచర్ల పై ఎత్తున చెరువుల కట్టలు తెగితే మాచర్ల మునిగిపోతుందని, సత్వరమే అక్విడెక్టు కానాలకు అడ్డుపడిన గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేలకు వినతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రభుత్వాలు ఎన్ని మారినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని, కార్మికుల సంక్షేమం ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందానా ఉందని పల్నాడు జిల్లా భవన ఇతర నిర్మాణాల కార్మికుల సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఎ.ప్రసాదరావు అన్నారు. సంఘ సమావేశం స్థానిక పుతుంబాక భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో విడుదలైన జీవో 1214 రద్దు కోసం భవన నిర్మాణ కార్మికులు పోరాడుతుండగా ఆ పోరాటానికి అప్పటి ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు తెలిపాయని, ఇప్పుడు ఆ పార్టీలు అధికారంలోకి వచ్చినా రద్దు చేయలేదని విమర్శించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వం కూడా భవన ఇతర నిర్మాణ కార్మికులపై కక్ష సాధిస్తుందా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పథకాలను కొసాగిస్తున్నాం అంటున్న ప్రభుత్వం తమ సంక్షేమమే భారం అయ్యిందా? అని ప్రశ్నించారు. అన్న క్యాంటీన్లను మరమ్మతులు చేసి ప్రారంభించిన ప్రభుత్వం తమను మాత్రం పక్కన పెట్టటం బాధాకరమన్నారు. ప్రభుత్వం చేపట్టే భవన నిర్మాణాల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలి, ఉచిత ఇసుక పాలసి విధానం మరింత సరళీకతం చేసి అందరికీ అందేలా ప్రభుత్వం కృషి చేయాలి, భవన, ఇతర నిర్మాణాల కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. ఈ అంశాలపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలసి వినతిపత్రం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆర్.ఆంజనేయులు, కె.ఆంజనేయులు, కొండలు, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అవ్వారు ప్రసాదరావు

పల్నాడులో భారత సైనికుల సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

టెరిటోరియల్ ఆర్మీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో లడక్ నుండి అండమాన్ నికోబార్ ఐస్లాండ్ వరకు ఇండియన్ ఆర్మీ నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ ఆదివారం మాచర్లకు చేరింది. స్థానిక కెసిపి కిడ్స్ పాఠశాలలో ఆదివారం జరిగింది. సమావేశం అనంతరం కిడ్స్ పాఠశాల నుండి కారంపూడి మీదుగా వినుకొండ వెళ్లే సైకిల్ యాత్రను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతంరెడ్డి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మనందరం ఇంత ప్రశాంతంగా ఉన్నామంటే దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి మన సైనికులు అహర్నిశయలు కాపలాగా ఉండడమే కారణమని చెప్పారు. వారికి ఒకరోజు సహకారం అందించే అవకాశం రావడం మన అదృష్టమని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.శ్రీను, షేక్ బాబుఖాన్, అన్వర్, అక్కిరెడ్డి జూలకంటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి కారంపూడి

సైకిల్ ర్యాలీ మాచర్ల నుండి కారంపూడికి ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రవేశించింది. సైనికులకు గ్రామ ప్రజలు, కూటమి పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపి ఆహ్వానించారు. షేక్. మొహిద్దీన్ షా ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుండి జెడ్పి హైస్కూల్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం స్కూల్లో అభినందన సమావేశం జరిగింది. సైనికులను సత్కరించారు. శెట్టి హనుమంతరావు, భవిరిశెట్టి. రామారావు మాట్లాడారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్మీ సైకిల్ యాత్ర ఆదివారం వినుకొండకు చేరుకోగా వారికి పట్టణంలోని 32 వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మాజీ ఆర్మీ, టిడిపి నాయకులు వెంకట్రావు, శివశక్తి సిబ్బంది, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ ఎండ్లూరి కిషోర్ తదితరులు స్వాగతం పలికారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రేపు నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 10వ తేదీన కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, రైతు సంఘం నాయకులు అజయ్‌కుమార్, తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాడీపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ రాష్ట్రంలో జరుగుతున్న పోరాటం 1302 రోజుకి చేరిందని తెలిపారు. ఒకవైపు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపుతామని చెబుతున్నారని, మరోవైపు బిజెపి ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ వైపే ముగ్గు చూపుతూ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజురోజుకు కుదించి వేస్తూ, కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నా ఈ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విషయంపై నోరు మెదపకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకపోతే భవిష్యత్తులో పోరాటం మరింత ఉధృతం అవుతుందన్నారు. గుంటూరులో మంగళవారం ఉదయం 10 గంటలకు శంకర్‌విలాస్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ్‌కుమార్, సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు పి.శివాజీ, రైతు కూలీ సంఘం నాయకులు వి.నరసింహారావు, కిసాన్ ఫెడరేషన్ నాయకులు కాలువ శ్రీధర్‌రావు, ఏరువాక రై సంఘం నాయకులు పి కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు కె.రంగారెడ్డి, బి.ముత్యాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర నాయకులు చిష్టి తదితరులు పాల్గొన్నారు.

11న రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో 11న జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మండూరు వెంకట నరసయ్య కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గుజ్జనగుండ్ల, పట్టాభిపురం, ఎస్.వి.ఎన్ కాలనీ, కొరిటపాడు, శ్యామల నగర్, శారదా కాలనీ, బృందావన్ గార్డెన్స్, విద్యానగర్ తదితర ప్రాంతాలు, యాదవుల బజార్ రజక నివాస కాలనీలు, దోబీకాన స్థలాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. రజక, ల్యాండ్రీ వృత్తిదారులకు నెలకు 250 యూనిట్లు కరెంటు ఉచితంగా మంజూరు చేయాలని, సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు కేటాయించాలని తదితర డిమాండ్స్‌ను సాధించుకునేందుకు నిర్వహిస్తున్న మహాసభని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో వెంపాటి చిన్న కొండయ్య (సీతయ్య), నగర అధ్యక్ష, కార్య దర్శులు బెండమూరిలంక కైలాసం, పేరుపాలెం రాంబాబు, అద్దంకి సాంబశివరావు పాల్గొన్నారు.

శాశ్వత ఆటోమేటిక్ షట్టర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది వరదనీరు ఉండవల్లి, పెనుమాక పంట పొలాలను ముంచెత్తుతుంది. మంతెన సత్యనారాయణ ఆశ్రమం వద్ద కరకట్టకు ఓ డ్రైనేజీ తూము షట్టరు ఉండేవి. ఎన్నో ఏళ్ల నుంచి దాన్ని పట్టించుకోక పోవడంతో షట్టర్ పాడైపోయింది. దీంతో కృష్ణానది నుంచి వరద నీరు ఉధృతంగా పంట పొలాల్లోకి చేరుతుంది. దీన్ని మరమ్మతు చేయడానికి ఆదివారం సాయంత్రానికి ఓ కొలిక్కి వచ్చినట్లు పెనుమాక, ఉండవల్లి రైతులు చెబుతున్నారు. రాజధాని గ్రామాలకు కూడా దీని వల్ల ప్రమాదం పొంచి ఉంది. యుద్ధప్రాతిపదికన గతంలో ఉన్న తూము దగ్గర శాశ్వతంగా పటిష్టమైన ఆటోమేటిక్ షట్టర్లు ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, ఈశ్వరరెడ్డి కోరారు.

ప్రజా కళాశిల్పి రాజారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

కళ కళ కోసం కాదు ప్రజల కోసం అంటూ ప్రజా సమస్యలను కళారూపాలుగా తీర్చిదిద్దిన గరికపాటి రాజారావును ఆదర్శంగా తీసుకొని కృషి చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు ఎస్.పద్మ అన్నారు. ఆదివారం బ్రాడిపేటలోని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యాలయంలో ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు వర్ధంతి సభను సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లూథర్‌పాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రాజారావు తన జీవితాంతం ప్రజాసమస్యలను ఇతి వత్తంగా తీసుకుని అనేక కళారూపాలు సష్టించారని, ప్రజానాట్య మండలిని స్థాపించి ప్రత్యామ్నాయ కళారూపాలతో ప్రజలను చైతన్యం చేశారని, ఆయన స్ఫూర్తితో నేటి సవలూజ మార్పునకు కషి చేయాలని అన్నారు.గుట్టం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ గరికపాటి రాజారావు 1946 నుండి 51 వరకు జరిగిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఇతి వత్తంగా తీసుకుని మా భూమి నాటకాన్ని ప్రదర్శించడం, దానినే సినిమాగా తీసి ప్రజలను చైతన్యం చేశారన్నారు. ప్రస్తుతం దేశంలో పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం, ధరలు పెరుగుదల, మతోన్మాదం పెరిగిపోతున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా రాజారావు స్ఫూర్తితో కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు వై.నేతాజి, ఎమ్.రవి, దండా లక్ష్మీనారాయణ, ఎమ్.ఎ.చిష్టీ, ఎల్.అరుణ, బి.సుధాకిరణ్, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గుంటూరులో రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

పెదనందిపాడులో

ప్రజాశక్తి - పెదనందిపాడు: ప్రజా కళాకారులు, ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు, ప్రజా వైద్యులు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమాన్ని ఆదివారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ కళ కోసం కాదు, ప్రజల కోసం అని నినదించిన ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు అని తెలిపారు. రమేష్ బాబు మాట్లాడుతూ గరికపాటి రాజారావు ప్రజా వైద్యులుగా విజయవాడ, రాజమండ్రి ప్రాంతాలలో వైద్యశాలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా వైద్యం, మందులు పంపిణీ చేసిన మహానుభావుడు అని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయటమే మనం వారికిచ్చే ఘన నివాళులు అని తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ టి యు రాష్ట్ర నాయకులు గేరా మోహన్ రావు, విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ కొత్త వెంకటశివరావు మాట్లాడారు, కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ జంపని రామారావు, సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకట సుబ్బారావు, చుక్కా యానాదులు, ఎమ్ పున్నారావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : గొప్ప ప్రజా కళాకారులు గరిగిపాటి రాజారావు అనే అభ్యుదయ రచయితల స ఘం రాష్ట్ర నాయకులు గోలి సీతారామయ్య అన్నారు. గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం మంగళగిరి సీపీఐ కార్యా లయంలో ప్రజానాట్యమండలి, సిపిఐ ఆధ్వర్యంలో రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-తెనాలి : ఆధునిక నాటక రంగానికి నటీనటులను పరిచయం చేసి ఆదర్శనీయుడిగా నిలిచిన వ్యక్తి డాక్టర్ గరికపాటి రాజారావు అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక గాంధీ నగర్ ఇస్కస్ కార్యాలయంలో రాజారావు వర్ధంతిని అభ్యుదయ కళా సమితి, ఏపీ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అరసం జిల్లా నాయకులు కనపర్తి బెన్హర్ ప్రసంగించారు.

ఎంబివికె ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఎంబివికె బాధ్యులతో పాటు స్థానిక సిపిఎం నాయకుల సహకారంతో కృష్ణానది ఒడ్డున వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. వరద బాధితులకు వరుసగా నాలుగు రోజుల పాటు భోజనం, మంచినీరు సదుపాయం కల్పించడం పట్ల మహానాడులోని కృష్ణానది ఒడ్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, బాధ్యులు పి.విజయ, స్థానిక నాయకులు ఎస్.వెంకట్రావు, బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, నారిన నాగేశ్వరరావు, వేముల

దుర్గారావు, పి.గిరిజ, డివి భాస్కరరెడ్డి, దర్శనపు విజయ్, డి.యోహాన్, బిట్రా రామారావు, నాగరాజు, ఐ.ఇస్సాక్, దేవదాసు, జానీ, మున్నా, దేవ, మల్లి, దావీదు, కె.మేరి, బి.రామారావు, జి.సాయి, యు.నాని, రేణుక, నాగరాజు, ఎస్కె బాష, కె.ప్రభాకర్, వి.కృష్ణ, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో చెత్తను తొలగిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు

వరద బాధితులకు అండగా ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు : విజయవాడలో వరద బాధితులకు అందిస్తున్న సేవా కార్యక్రమాల్లో గుంటూరుకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వీధులలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయటం, రోడ్లపై నిలిచిన నీటిని కాల్వల్లోకి మళ్లించటం, బాధితులకు ఆహారం, మంచినీరు అందించటం తదితర కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తున్నారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

విద్య, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జనవిజ్ఞాన వేదిక విద్య, పర్యావరణ రంగాల్లో పని చేయాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ ఆఫీసులో నిర్వహించిన సంఘం 17వ వార్షిక సమావేశాల సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రదమ్ సర్వే ప్రకారం మన రాష్ట్రం బాగా వెనుకబడి ఉందన్నారు. దీని మార్పు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఊరికొక బడి, ప్రతి తరగతికి ఒక టీచర్ ద్వారా మాత్రమే ఇది సాధ్యం అవుతుందన్నారు. పర్యావరణ సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యావంతులు కూడా దిష్టి తగలకుండా కాలికి నల్లదారం, రంగురాళ్ల ధరించటం, న్యూమరాలజి వంటి మూఢనమ్మకాలను పాటిస్తున్నారని, శాస్త్రీయ ఆలోచనా ధోరణి పెరిగే విధంగా జెవివి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ ప్రసంగించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు అధ్యక్షత వహించగా, జి.వెంకట రావు, ఎస్.కె.అహ్మద్ హుస్సేన్, టి.ఆర్.రమేష్, ఇ.అనిల్ కుమార్, ఆర్.స్వాతి, ఇ.రాధ, వివికె.సురేష్, ఎస్ఎం.సుభానీ, శంకర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ లు పొందిన విద్యార్థులతో సమితి నిర్వాహకులు

రూ.18 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి : స్థానిక బ్రాడీపేట లోని బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో బ్రాహ్మణ సేవా సమితి వారిచే 2024-25 సంవత్సరంనకు విద్యా పారితోషిక ప్రధానోత్సవం ఆదివారం జరిగింది. రూ. 18లక్షలను 250 మంది ఇంటరు, డిగ్రీ, సిఏ, పిజి, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుకొంటున్న విద్యార్థినీ విద్యార్థు లకు స్కాలర్ షిప్ లను అందజేశారు. సభకి సమితి అధ్యక్షులు ఆర్. లక్ష్మీపతి అధ్యక్షత వహించారు. లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత స్థానం పొందిన తరువాత సమితికి సహాయ సహకారములు అందజేయాలని, ఎక్కువ మంది విద్యార్థులకు పారితోషము అందించ వచ్చని తెలిపారు. సమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ సమితి సభ్యులు జి సంజీవరావు, వినోద్‌కిరణ్, ఎం వెంకటకృష్ణ, మంగాదేవి, కోశాధికారి కె బాలకృష్ణ, సహాయ కార్యదర్శి పి శ్రీనాథ్, ఎం కోదండరామారావు, పి మురళి, కె సీతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

విజయవాడ వరద బాధితుల కోసం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్ ఏరియాలో దుకాణాల నుండి విరాళాలు సమీకరించారు. జి.మల్లేశ్వరి, డి.శేషారావు, టి.హనుమంతరావు, సయ్యద్ అక్బర్, కె.నరసింహారావు, హబీబ్, పి.బుజ్జి పాల్గొన్నారు.

వరద బాధితులకు అమ్మా చేయుత ఆహారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం అమ్మా చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రెడ్, బిస్కెట్లు, కొవ్వొత్తులు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ప్రత్యేక వాహనంలో స్వచ్ఛంద సభ్యులు విజయవాడ వెళ్లగా వాహనాన్ని మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. వీటిని విజయవాడ రాజీవ్ నగర్ ఏరియాలో ప్రజలకు సంస్థ సభ్యులు అందచేశారు. సంస్థ అధ్యక్షులు కె.దస్తగిరి, టి.వెంకటరావు, కె.ఏసుబాబు, పి.రత్తయ్య, ఎస్.వేణుబాబు, డి.చిన్న, సిహెచ్.వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హై, అంకమ్మరావు, షేక్ చిన్న షరీఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

విజయవాడలో వరద బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు మాచర్ల పట్టణం నుండి మెప్మా అధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో సుమారు 250 మంది మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు విజయవాడ వెళ్లారు. కార్యక్రమంలో సీఓ రాజశేఖర్, అంజలి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మెల్యే సహాయక కార్యక్రమాలు

ప్రజాశక్తి- మాచర్ల

విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఆరవ రోజు పర్యటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడుతో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వరద నష్టం అంచనా వేసేందుకు ఉన్నతాధికారులు మీ ఇళ్ల వద్దకే వచ్చి అంచనా వేస్తారని చెప్పారు. ఈ సందర్భంలో సిఎం చంద్రబాబు అటుగా రాగా స్థానిక పరిస్థితులను సిఎంకు బ్రహ్మారెడ్డి వివరించారు.

చంద్రబాబుకు పరిస్థితులు వివరిస్తున్న బ్రహ్మారెడ్డి

రహదా(జా)రులు

అంగలూరు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

బొమ్మరాజు పల్లి కనుమలో నీటితో నిండిన రోడ్డు

ప్రజాశక్తి-ఈపూరు

వినుకొండ-కారంపూడి ప్రధాన రహదారి లోతైన గోతులతో ఛిద్రమైంది. వినుకొండ-కారంపూడి ప్రధాన రోడ్డు మార్గంలో మండలంలోని అంగలూరు, వనికుంట, బొమ్మరాజు పల్లి కనుమ, కొచ్చర్ల గ్రామ సమీపాలలో రోడ్డుపై తారు లేచి లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ప్రకాశం జిల్లా నుండి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు ఇదే రోడ్డు మార్గంలో నిరంతరం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వాన నీటితో గుంతలు నిండిపోయి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వినుకొండ కారంపూడి రోడ్డు మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. బొమ్మరాజుపల్లి కనుమలో రోడ్డుపై గుంతలో వర్షం నీరు నిలబడటంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కాలంగా రోడ్డు గోతులమయంగా మారినా మరమ్మత్తులు చేపట్టకపోవడం పట్ల వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్థానిక పోలీసులు ప్రమాదాల నివారణకు పలుమార్లు కంకర చిప్స్‌తో గుంతలను పూడ్చారు. వనికుంట వద్ద రోడ్డు ఛిద్రమై రోడ్డు నీటితో నిండిపోవడంతో నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులు అదుపుతప్పి నీటిలో పడటంతో గ్రామస్తులు స్పందించి వారిని లేపి పంపించారు. కొద్దిరోజుల క్రితం ఆర్ అండ్ బి సిబ్బంది రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చి మమ అనిపించారు.

వనికుంట వద్ద ఛిద్రమైన రోడ్డు

అంగలూరు, వనికుంట గ్రామస్తులు గ్రామం ముందు రోడ్డుపై పడిన గుంతలను ట్రాక్టర్ల సాయంతో మట్టితో తాత్కాలికంగా పూడ్చారు. అయితే వర్షాల ప్రభావంతో కొద్ది రోజులకే వాహనాల రద్దీతో మట్టి కొట్టుకుపోయి రోడ్డుపై గుంతలు యథాతథంగా మారాయి. రాత్రి సమయాల్లో అయితే ప్రాణ భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రోడ్డు మరమ్మతులకు అంచనాలు పంపించాం

ఆర్ అండ్ బి డిఇ గోపికృష్ణ

రోడ్డు గుంతలతో, వర్షాలతో పూర్తిగా పాడైన మాట వాస్తవమే. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతులకు అంచనాలు పంపించాం. అనుమతులు రాగానే వెంటనే మరమ్మతులు చేపడతాం.

వర్షాలకు పొంగిన ఓగేరు వాగు, దండమూడి వద్ద ఓగేరు వాగు కోత గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

సమగ్ర అధ్యయనం తర్వాతే నష్టంపై స్పష్టత

వాగుల మరమ్మతులు, కట్టల పటిష్టతకు పనులు చేయిస్తాం : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

డ్రెయిన్ల వ్యవస్థను వైసిపి ప్రభుత్వం నాశనం చేయగా ఆ దుష్ఫలితాలను రాష్ట్రం ఇప్పుడు ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ, కాల్వలను మెరుగుపరచడానికి కేంద్రం నిధులు కేటాయిస్తే తప్ప ఈ సంక్షోభం నుంచి బయట పడలేమన్నారు. మండలంలోని దండమూడి వద్ద ఓగేరు వాగు కోతకు గురైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. వరద ఉధృతితో తమ పొలాలూ కోతకు గురయ్యాయని స్థానిక రైతులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. వైసిపి నాయకులు వాగును ఆక్రమించి పొలాలు సాగు చేసుకుంటున్నారని, వాగు కుదించుకుపోయి వరద నీరు పొలాలను ముంచెత్తిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షం తగ్గిన తర్వాత వాగులు, డ్రెయిన్ల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేశాకే నష్టం ఎంతనేది తేలుతుందన్నారు. వాగులో పూడిక తొలగిస్తామని, రెండు వైపులా కరకట్టలు పటిష్టం చేస్తామని, వాగుకు మరమ్మతులూ చేయిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో వాగులను ఏ విధంగా ఆక్రమించారో ఓగేరు వాగును చూస్తేనే అర్థమవుతుందన్నారు. సాగర్ కాల్వలు సహా అన్నీ నిర్లక్ష్యానికి గురికావడం వల్లనే రాష్ట్రంలో చిన్నపాటి వర్షానికి కూడా నీట మునిగే పరిస్థితి ఏర్పడిందన్నారు.

రసాయన విగ్రహాలు, ప్రతిమలతో జల కాలుష్యం

ప్రజాశక్తి - పెదకూరపాడు

రంగులు, రసాయనాలతో చేసిన వినాయక ప్రతిమలు, విగ్రహాలను నీటిలో నిమజ్జం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని పల్నాడు జిల్లా తెలుగురైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు. జన చైతన్య సమితి ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర మెడికల్, ఫ్యాన్సీ స్టోర్ నిర్వాహకులు యామ నరేంద్ర సహకారంతో వినాయక మట్టి ప్రతిమలను శనివారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ జి.బాబురావు, ఎఎస్ఐ భూక్యా రాంజీనాయక్, టి.సాంబశివరావు, డి.విజయ్ బెన్నిబాబు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకునికి నివాళి

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని ఎమ్మాజీగూడేనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు చిట్టిమాల పెద్దవీరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. భౌతికకాయాన్ని గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి శనివారం సందర్శించి నివాళులర్పించారు. టిడిపి అభివృద్ధికి పెదవీరయ్య ఎంతో కృషి చేశారని కొనియాడి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు టి.రామకృష్ణ, వి.పేరయ్య, కె.చిన్న వెంకయ్య, వీరాంజనేయులు ఉన్నారు.

పలు సమస్యలపై సిపిఎం శాఖా మహాసభలు తీర్మానాల ఆమోదం

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల పట్టణానికి చుట్టు పక్కల 100 గ్రామాలకు ఎంతో అవసరమైన మాచర్ల ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని సిపిఎం పల్నాడు జిల్లా నాయకులు ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ ఒకటవ శాఖ మహాసభ దార్ల వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. కార్యదర్శిగా వై.సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, మాచర్ల పట్టణ ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని, దుర్గి మిర్చి యార్డ్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలని, మాచర్ల పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారంగా పైప్‌లైన్ పూర్తి చేయాలని, ఇఎస్ఐ క్లినిక్‌ను అన్ని వైద్య సదుపాయాలు ఉన్న హాస్పిటల్‌గా మార్చాలని, ప్రభుత్వ కాలేజీలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, వరద ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని కోరుతూ తీర్మానాలను ఆమోదించింది. తొలుత జెండాను సీనియనర్ నాయకులు కె.ఆదినారాయణ జెండా ఆవిష్కరించారు.

ప్రజాశక్తి - అమరావతి

చారిత్రాత్మక అమరావతికి శాశ్వతమైన డ్రెయినేజీ సౌకర్యాన్ని కల్పించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణానది ఒడ్డునే ఉన్నా స్థానికులకు రక్షిత నీరు కరువైందన్నారు. సిపిఎం అమరావతి శాఖ మహాసభ స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్లో యేసయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ధరణికోట నూనె గుండం చెరువుకు వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయాలని, సత్తనపల్లి రోడ్‌లో అగస్టీన్ స్కూల్ వద్ద డంపింగ్ యార్డ్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని, అగస్టీన్, పల్లోటి కాలేజి, ఆర్ వివిఎన్ ధన్యకటక కాలేజీ వెళ్లే విద్యార్థినులను ఆకతాయి ఇబ్బంది చేస్తున్నారని పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు షేక్ నాగుల మీరా ఎగరవేశారు. జిల్లా నాయకులు జి.మల్లీశ్వరి, ఎస్.రాజకుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, సిహెచ్ మురహరి, ఎస్‌కె రఫీ, టి.కృష్ణ, ఎస్‌డి మోహిద్దిన్‌వలి పాల్గొన్నారు.

ఆహారం, వ్యాయామంతో మధుమేహం నియంత్రణ

మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్

ప్రజాశక్తి-గుంటూరు

శారీరక శ్రమ లేకుండా, అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి వలన నేటి తరంలో 20 సంవత్సరాల వయస్సు నుండి కూడా మధుమేహం బారిన పడుతున్నారని, ఆహారం, వ్యాయామంతో మధుమేహం నియంత్రించవచ్చని ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ బొర్రెడ్డి తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో మధుమేహం, థైరాయిడ్, బిపి సమస్యలపై జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కార్బోహైడ్రేట్స్, పిండి పదార్థాలు తక్కువగా, ప్రోటీన్లు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటే ఈ మధుమేహాన్ని నివారించటంగానీ, కొంత సమయం వాయిదా వేయొచ్చన్నారు. మధుమేహం ఉన్నవారు ఆహారాన్ని తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తీసుకుంటే మంచిదన్నారు. షుగర్ వ్యాధి ఉన్నవాళ్లు ఆరెంజ్, బొప్పాయి, జామ, దానిమ్మ లాంటి పండ్లు తీసుకుంటే మంచిదని, సపోటా, మామిడి, బత్తాయి, అరటి, సీతాఫలం లాంటి పండ్లు తీసుకోకూడదని వివరించారు. స్వీట్స్‌కు దూరంగా ఉండాలని, షుగర్‌ఫ్రీ స్వీట్లు అప్పుడప్పుడు తీసుకోవచ్చన్నారు. రుచిలో తీపిని కలిగి ఉండి రక్తంలో చక్కెర శాతాన్ని పెంచకుండా ఉండేవిధంగా వచ్చిన పౌడర్లను పాలలో కలిపి తాగవచ్చు అన్నారు. మధుమేహం రకాలు, వాటిని నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలు, చికిత్స గురించి వివరించారు. బీపీ గురించి మాట్లాడుతూ శరీరంలో బీపీ నియంత్రణలో లేకపోతే గుండె, మూత్రపిండాలు దెబ్బతింటాయని, షుగర్ వ్యాధి ఉన్నవారికి, నియంత్రణలో లేని వారికి బీపీ రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక్కసారి బిపి వస్తే జీవితాంతం మందులు వాడాల్సి వస్తుందన్నారు. అనంతరం థైరాయిడ్ సమస్య గురించి వివరించారు. తదుపరి డాక్టర్ రాజీవ్ బొర్రెడ్డి అవగాహన సభ్యులు అడిగిన సందేశాలను నివృత్తి చేశారు. డాక్టర్ రాజీవ్ బొర్రెడ్డిని సభ్యులు సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డి నేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత ప్రధానోపా ధ్యాయులు ముప్పాళ్ళ ప్రసాదరావు, విశ్లేషకులు పాములరెడ్డి పాల్గొన్నారు.

డయాబెటిక్ న్యూరోపతిని అశ్రద్ధ చేయకూడదు

ప్రజాశక్తి-గుంటూరు

మధుమేహ బాధితుల్లో రక్తంలో షుగర్ శాతం ఎక్కువ కాలం, అధికంగా ఉండటం వల్ల నాడీ కణజాలం జీవన క్రీయలలో అనేక అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయని ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవాకుమార్ అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ మీటింగ్ హాల్లో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్తంగా నిర్వహించిన న్యూరోపతి ఉచిత పరీక్ష శిబిరం, శాస్త్రీయ అవగాహన సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. దీర్ఘకాల మధుమేహ బాధితులలో చోటుచేసుకునే ఈ అసాధారణ మార్పులనే శాస్త్రీయ పరిభాషలో 'డయాబెటిక్ న్యూరోపతి' అంటారని, నాడులలో సంభవించే మార్పుల వల్ల నాడుల ప్రధాన విధి అయిన 'నొప్పిని తెలిపే' విధికి అవరోధాలు ఏర్పడతాయన్నారు. సాధారణ వ్యక్తుల్లో కంటే మధుమేహ బాధితుల శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందనీ, దీనికితోడు నాడులు న్యూరోపతికి గురవడం వల్ల నొప్పి తెలియనందువల్ల గాయాలను అశ్రద్ధ చేస్తారన్నారు. అంతేకాకుండా రక్తనాళాలలో కొవ్వు పేరుకు పోవడం వల్ల, వయసు మీద పడిన కారణంగానూ రక్తనాళాలు సన్నబడి రక్త సరఫరా కూడా తక్కువగా ఉంటుందన్నారు. డయాబెటిక్ న్యూరోపతికి గురైన వారిలో రెండు కాళ్ళలో నొప్పులు, మంటలు, చురుకులు, సూదులు గుచ్చినట్లు ఉండటం, తిమ్మిర్లు, మొద్దు బారడం, పాదాలు చల్లబడిపోవడం, స్పర్శ జ్ఞానం తగ్గిపోవడం, నిద్ర లేక పోవడం, మానసికంగా కంగిపోవటం వంటి లక్షణాలు బయటపడతాయన్నారు. ఈ లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. న్యూరోపతి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవటానికి బయోతీషియో మీటర్ ఉపయోగపడుతుందన్నారు. ఇది చాలా సులభంగా చేసే పరీక్ష అని, మధుమేహ బాధితులు ప్రతి ఆరు నెలలకు డయాబెటిక్ న్యూరోపతి పరీక్ష చేయించుకోవటం మంచిదన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, పోర్టర్ అండ్ గాంబిల్ ప్రతినిధి బి.అజయ్‌కాంత్, ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, డైరెక్టర్ ఉప్పల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో

తాడేపల్లిలో

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ పద్మశాలియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునగపాటి వెంకటేశ్వరరావు, వ్యవస్థాపకులు జే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని 6, 22,26 వార్డుల గల వరద బాధితులైన చేనేత కార్మికులకు దుప్పట్లు, చీరలు, కండువాలు, షర్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ అంజిబాబు, పి మోహన్లాల్, పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ.. రాష్ట్ర టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆహార పొట్లాలు ఏర్పాటు చేసి విజయవాడ పంపించారు. స్వయంగా కాండు శ్రీనివాసరావు వరద బాధితులకు పంపిణీ చేశారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో.. జనసేన పార్టీ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యవసర సరుకులు, కూరగాయలు, దుప్పట్లను పంపించారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : వరద ముంపుకు గురైన మహానాడులోని 200 మంది వరద బాధితులకు తాడేపల్లి శ్రీ శ్రేయన్ ఎన్‌క్లేవ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కార్పొరేటర్ టి.కొండారెడ్డి, శ్రీ శ్రేయన్ ఎన్‌క్లేవ్ బాధ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : కష్ణానది వరదలకు జలదిగ్బంధంలో చిక్కుకున్న హరిశ్చంద్ర పురం గ్రామం క్రమంగా నీటి ఉధృతి తగ్గడంతో కోలుకుంటోంది. వరదల కారణంగా నష్టపోయినవారికి ఉపాధ్యాయులు గల్లా శంకరరావు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరావతి పై దుష్ప్రచారం తగదు : జెఎసి

ప్రజాశక్తి - తుళ్లూరు : అమరావతి రాజధానిపై దుష్ప్రచారం తగదని, నిన్నటివరకు మూడు రాజధానులంటూ విషం చిమ్మి నేడు అధిక వర్షాలను సాకుగా చూపి రాజధాని మునిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసిపి నాయకులపై అమరావతి రైతు జెఎసి నాయకులు మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు, కొంతమంది వ్యక్తులు అమరావతి గురించి అబద్దాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో లిఫ్ట్ ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంకొండ నరసింహారావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో కొండవీటివాగు, కోటేళ్ల వాగు, పాలవాగు, సార వాగు తదితర వాగులు ఉన్నాయని వాటి విస్తీర్ణం స్వభావం గురించి ఏ మాత్రం అవగాహన లేనివారు అమరావతి మునిగిందంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాజధాని నిర్మాణం నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం ద్వారా వరద నీటిని విజయవంతంగా కృష్ణానదిలోకి మళ్లించిన సంగతి అందరికీ తెలుసని అన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో కొండవీటివాగు, ఇతర వాగులో పూడికలు తీయడం, నాచు, గుర్రపుడెక్క, కంప చెట్లు తొలగించడం లాంటి పనులను పూర్తిగా విస్మరించడం జరిగిందని అన్నారు. ధనేకుల రామారావు మాట్లాడుతూ అమరావతిలో సచివాలయం, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర భవన సముదాయాల వద్ద నిలిచిన కొద్దిపాటి నీటిని ముందుకు ప్రవహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వైసిపి నాయకులు అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. కళ్ళం రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకులు రాజధాని ఎక్కడ మునిగిందో చూపాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ ను పడవలు ఢీ కొట్టిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించి కారకులను కఠినంగా శిక్షించాలని రైతు జెఎసి కోరుతోందని అన్నారు. అమరావతి దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య మాట్లాడుతూ చంద్ర బాబు ఇల్లు, అమరావతి మునిగిపోయాయంటూ చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా రైతులు శ్రీదేవి, కొమ్మినేని వరలక్ష్మి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జలవనరుల శాఖ మంత్రులుగా చేసిన అనిల్ కుమార్, అంబటి రాంబాబుకి క్యూసెక్కులకి, టిఎంసికి తేడా తెలియదని ఎద్దేవా చేశారు. అధిక వర్షాల కారణంగా సచివాలయం ఉద్యోగులు,సిబ్బందికి సెలవు ఇస్తే వైసిపి నాయకులు దానిని కూడా రాజకీయం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు.

మాట్లాడుతున్న అమరావతి రైతు జెఎసి నాయకులు

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో కురుస్తున్న వర్షాల వల్ల విద్యుత్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందని, అలాగే నివాస ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ తీగలు పడి ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ డిఇ డి.సత్యనారాయణ, తాడేపల్లి నులకపేట, కుంచనపల్లి ఎఇలు షణ్ముకరావు, లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ తీగలు పడి ఉంటే అటువైపు ఎవరూ వెళ్లకుండా సమీపంలోని విద్యుత్ ఉప కేంద్రానికి సమాచారం అందించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా తోడ్పడాలని కోరారు.

నిడుముక్కలలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని నిడుముక్కల గ్రామంలో గుంటూరు రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో ఆదివారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. మండల పార్టీ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ తలసిల ప్రసన్న ఆధ్వర్యంలో రమేష్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ యు గజపతి నేతృత్వంలో శిబిరం నిర్వహించారు. షుగర్ బిపి గుండె సంబంధిత వ్యాధులకు 130 మందికి పైగా వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్ హాస్పటల్ వైద్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

సంపూర్ణ అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి

ప్రజాశక్తి - పెదనందిపాడు : సంపూర్ణ అక్షరాస్యత ద్వారానే అభివద్ధి సాధ్యమని, సంపూర్ణ అక్షరాస్యతను సాధించుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని చేజెర్ల జడ్‌పిహెచ్ టీచర్, ఎస్‌టియు నాయకులు గేరా మోహనరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం పెదనందిపాడు గ్రంధాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మోహనరావు మాట్లాడారు. అక్షరాస్యతలో ముందున్న దేశాలు అభివృద్ధి చెందాయన్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా ఇంకా సంపూర్ణ అక్షరాస్యతను లేనందున అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని పేర్కొన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రభుత్వం, ఎన్జీవోలు, మేధావులు తమ వంతు పాత్రను నిర్వహించాలని, అప్పుడే చెందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పి సుభాషిని, గారపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మట్టి ప్రతిమల పంపిణీ చేస్తున్న పట్టణ ఎస్ఐ మహేష్ కుమార్

ఉచితంగా వినాయక ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

వినాయక చవితి సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి మిద్ది సెంటర్లో ఉచితంగా వినాయక మట్టి ప్రతిమల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ పి మహేష్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందే మురళీమోహన్, కోశాధికారి వీ శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, సభ్యులు పి రాజశేఖర్, కే సుందరయ్య, పి నిరంజన్ గుప్తా పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్, ఎస్పి గ్రీవెన్స్‌లు రద్దు

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లాలో భారీ వర్షాల కారణంగా కలెక్టరేట్‌లో నేడు నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి : వర్షాలు కురుస్తున్నందువల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ ను రద్దు చేసినట్లు ఎస్. పి. ఎస్ సతీష్ కుమార్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వలన తాత్కాలికంగా రద్దు చేశా మన్నారు.

వరద బాధితులకు అండగా జిఎంసి కార్మికులు

ప్రజాశక్తి-గుంటూరు : విపత్కర పరిస్తితుల్లో ఉన్న విజయవాడ వాసులకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులు, సిబ్బంది అండగా నిలుస్తున్నారని, వరద ప్రభావిత ప్రాంతాలను పూర్వస్థితికి తెచ్చేందుకు విశేష కృషి చేస్తున్నారని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఎంసి కార్మికులు తమకు కేటాయించిన అన్ని ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టి, ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారిన అన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనుల్లో 24 గంటలూ 500 మంది పారిశుధ్య కార్మికులు, ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు, 4 ఈఈలు, 2 ఎస్ఎస్‌లు, 6 మంది శానిటరీ ఇన్స్పెక్టర్లు, 12 మంది మేస్త్రీలు, 20 శానిటేషన్ కార్యదర్శులతో పాటు, 15 చెత్త తరలింపు ట్రాక్టర్లు, 4 జెసిబిలు, 4 రోబోలు విధుల్లో ఉన్నాయన్నారు. కార్మికులు రోడ్ల శుభ్రం చేయటం, నీటిని డ్రైన్లలోకి మరలించడం, డ్రైన్లలో వ్యర్ధాలను తొలగించడం, వ్యర్ధాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చేస్తున్నారన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాన్ని వరద ప్రభావితం నుండి సాధారణ స్థితికి తీసుకురావడానికి కషి చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు నియామకం

పల్నాడు, గుంటూరు జిల్లాలకు గర్నెపూడి అలెగ్జాండర్, చిలకా విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ వరుసగా 3 వ సారి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. ఈయన గత సార్వత్రిక ఎన్నికలలో పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 18,046 ఓట్లు సాధించారు. న్యాయవాదిగా పేద ప్రజలకు అన్యా యం జరిగిన నేపథ్యంలో వారి తరపున వాదించి న్యాయం చేయ డంతో పాటు ఎందరికో న్యాయ సలహాలు సూచనలు అందజేస్తూ ప్రజల మన్ననలు సుధాకర్ పొందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి తానొక నిదర్శనమన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు. 3వ సారి పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన షర్మిల, సోనియా గాంధి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,కెసి. వేణుగోపాల్, కెవిపి రామంద్రరావు, రఘువీరారెడ్డి, జెడి శీలం,సాకె శైలజానాథ్,గిడుగు రుద్రరాజు లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

గర్నెపూడి అలెగ్జాండర్

ప్రజాశక్తి - తుళ్లూరు

కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షునిగా రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి దళితవాడకు చెందిన చిలకా విజయ్ కుమార్ నియమించబడ్డారు. ఈ మేరకు ఎఐసిసి, ఎపిసిసి నుంచి విజయ్ కుమార్‌కు ఆదివారం నియామక ఉత్తర్వులు అందాయి. విజయ్ కుమార్ అమరావతి ఉద్యమంలో కాంగ్రెస్‌పార్టీ తరపున పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కరోనా సమయంలోనూ సేవలు అందించారు. మొదటినుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ గ్రామ స్థాయి పదవుల నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగారు. గత అసెంబ్లీ ఎన్నికలలో తాడికొండ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి అనూహ్యంగా కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సూచనల మేరకు పోటీ నుంచి తప్పుకొని కడపలో ఎన్నికల బాధ్యత నిర్వహించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా తనను నియమించడం పట్ల విజయ్ కుమార్ అధి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. దేశ వ్యాప్తంగా బిజెపి ప్రతిష్ట నానాటికీ దిగజాగుతోందని, అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ పట్ల, రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. షర్మిల రాజకీయ పరిణితి కలిగిన నాయకురాలని, వచ్చే ఎన్నికల నాటికి తన సత్తా చాటుతారని, ప్రజల నమ్మకాన్ని చూరగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

చిలకా విజయ్ కుమార్

నొప్పుల నివారణలో 'ఫిజియోథెరపీ' ముఖ్యపాత్ర

ప్రజాశక్తి-గుంటూరు

వైద్యరంగంలో చికిత్స అనంతరం రోగులను పూర్తిగా కోలుకునేలా చేయటంలో ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం ఉందనిప్రముఖ ఫిజియోథె రపిస్ట్ డాక్టర్ మల్లెల దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ విద్యను అభ్యసించే విద్యార్థులు ప్రత్యేక శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవా లన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీ, హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో ఆదివారం 'ప్రపంచ ఫిజియోథెరపీ డే' నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసిన అనంతరం కళాశాల ఛైర్‌పర్సన్ మహీనా షేక్, ప్రిన్సిపాల్ సుభాని షేక్ మాట్లాడుతూ విద్యార్థులకు అంకితభావం , ఆసక్తి ద్వారా ఫిజియోథెరపీలో వస్తున్న కొత్త విషయాలను నేర్చుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ విద్యార్థులు వెన్ను నొప్పి, మోకాళ్లు, కండరాల నొప్పులపై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.హరికృష్ణ, ఫిజియోథెరపీ అధ్యాపకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఇమ్రాన్‌ఖాన్, డాక్టర్ దయాకర్, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ మొయిజుద్దీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ మృదుల, డాక్టర్ సైదాబీ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ మల్లెల దిలీప్‌కుమార్ తదితరులు

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక ప్రపంచంలో సమాజ గతిని మార్చగల ఏకైక శక్తి ఉపాధ్యాయులదేనని అంకితభావంతో విద్యార్థులకు చదువుతోపాటు జీవిత గమనాన్ని నేర్పాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గోరంట్ల నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 'పాన్ ఇండియా ఐకానిక్ టీచర్స్ అవార్డ్స్ 2024' వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఒక పెన్, పుస్తకం, ఒక ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని మార్చగలిగే సత్తా ఉన్నదన్న మలాల కలలను నిజం చేయాలని టీచర్లకు ఉద్బోధించారు. ఫెడరేషన్ వ్యవస్థాపకులు రామనాథం అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం స్థాపించిన ఫెడరేషన్ ద్వారా కరోనా సమయంలో వందలాది మంది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందించామని, ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు వివరించారు.

అవార్డులు అందచేస్తున్న లక్ష్మణరావు తదితరులు

కార్యక్రమంలో డాక్టర్ కన్నా మాస్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఇండో అమెరికన్ డాక్టర్ చాగంటి సుబ్బారావు, పాటిబండ్ల విష్ణువర్ధన్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర విశిష్టమైనది అని లైన్స్ క్లబ్ ఆఫ్ జయహో గుంటూరు ప్రెసిడెంట్ ముట్లూరి వెంకయ్య అన్నారు. స్థానిక కెఎస్ఆర్ నర్సింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ పాఠశాలు, కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. రిటైర్డ్ డిఇఒ డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ ఒక ఉపాధ్యా యుడు ఉన్నతమైనటువంటి సమా జాన్ని నిర్మించడానికి అహర్నిశలు కృషి చేస్తాడని, వారి కృషి వల్లే నేడు అనేక మంది ఉన్నత శిఖరాలు చేరుకుంటున్నారన్నారు. ఎపి గురుకులాల సెక్రెటరీ ఆర్.నరసింహారావు మాట్లాడుతూ నేడున్న ప్రపంచాన్ని సక్రమమైన మార్గంలో పెట్టగలిగిన వారు ఉపాధ్యాయులు మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో లయన్స్

సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

316-హెచ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ సిహెచ్ హరిప్రసాద్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఎస్పీ, రీజియన్ చైర్మన్ చెన్నంశెట్టి చక్రపాణి చార్టెడ్ ప్రెసిడెంట్ ఎరసాని కోటేశ్వరరావు, క్లబ్ సభ్యులు కమతం శ్రీనివాసరావు, ఆలా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారానికి రోగి ఖాతాలో నగదు జమ

క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

క్రమం తప్పకుండా మందుల వినియోగంతో నివారణ -గ్రామాలలో అవగాహన కార్యక్రమలు

ప్రజాశక్తితో క్షయ, లెప్రసి, ఎయిడ్స్ పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ కె.మరళీకృష్ణ

వైద్య సిబ్బంది కృషితో పల్నాడు జిల్లాలో రోజు రోజుకు క్షయ వ్యాధి ప్రభావం తగ్గుతుందని క్షయ, లెప్రసి, ఎయిడ్స్ పల్నాడు జిల్లా ఇంచార్జ్ అధికారి డాక్టర్ మురళి కృష్ణ అన్నారు. గ్రామాలలో పట్టణాలలో రోగులను గుర్తించిన వైద్యసిబ్బంది వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే క్రమం తప్పకుండా మందులు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రోగికి అవసరమైన పౌష్టికాహారానికి అయ్యే ఖర్చుకు సంబంధించి నిధులను వారి ఖాతాలలో జమ చేస్తుందని, జనాభా ప్రాతిపదికన నమోదు కావాల్సిన కేసుల కంటే తక్కువ నమోదు కావడం హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని వివరాలు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఎలా గుర్తిస్తున్నారు?

ఆశా కార్యాకర్తలు ఇంటింటి సర్వే చేసే క్రమంలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వారి నుండి నమూనాలు సేకరించి ప్రాథమిక పరీక్షలో అనుమానంగా తేలితే నమూనాలు విశాఖపట్నం లేదా నెల్లూరు పంపించి పరీక్షలలో వ్యాధి తీవ్రత నిర్ధారిస్తాం.

క్షయ నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వ పరంగా ఏమైనా సహాయం అందుతుందా?

ప్రభుత్వ పరంగా నిక్షయ పోషణ యోజన ద్వారా ప్రతి క్షయ వ్యాధి గ్రస్తునికి నెలకు రూ 5 వందలు నేరుగా రోగి ఖాతాకు జమ చేయడం జరుగుతుంది. క్షయ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితం. గతంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేయడం జరిగింది.

పల్నాడు జిల్లాలో ఎంతమంది క్షయ వ్యాధి గ్రస్తులున్నారు?

పల్నాడు జిల్లాలో మొత్తం 1606 మంది క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్నారు. వీరిలో 1533 మంది నిక్షయ పోషణ్ యోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వారికి వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలలు, 9 నెలలు పాటు నెలకు రూ .5 వందలతో పాటు మందులు ఎప్పటికపుడు వ్యాధి తీవ్రత తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. వివిధ కారణాలు నేపథ్యంలో 83 మంది పథకాన్ని అందుకోలేకపోయారు.

పల్నాడు జిల్లాలో టిబి పరీక్షలు ఎక్కడెక్కడ చేస్తున్నారు?

నరసరావుపేట, చిలకలూరిపేట, గురజాల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, ఈపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టి.యు యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. టిబి, ఎయిడ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.

నెలకు ఎన్ని టిబి పరీక్షలు చేస్తున్నారు?

పల్నాడు జిల్లాలో నెలకు 5516 పరీక్షలు లక్ష్యం కాగా లక్ష్యం మేరకు పరీక్షలు జరుగుతున్నాయి.

లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలా వ్యాపిస్తుంది?

టిబి ఒక సంక్రమిత వ్యాధి. సోకిన వారికి రక్తం, శ్లేష్మం దగ్గు, ఛాతీ నొప్పి, శ్వాస తీసు కోవడంలో ఇబ్బంది, తరచూ జ్వరం, చలి, రాత్రి చెమటలు పట్టడం, బరువు తగ్గడం, అలసట, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయి. పొగ త్రాగే వారు, వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారు టిబి బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో క్షయ వ్యాధి వ్యాప్తి ఎలా ఉంది, మరణాలు ఏమైనా ఉన్నాయా?

క్షయ అనేది ఒక సంక్రమిత వ్యాధి. క్షయ వ్యాధి గ్రస్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు సులభంగా ఒకరి నుండి మరొకరికి సంక్రమి స్తుంది. జిల్లాలో క్షయ వ్యాధి ఉధృతి గత 2 ఏళ్ళతో పోలిస్తే తగ్గుతుంది. 2022 లో 2500 లకు పైగా ఉంటే 2023 లో 2 వేలు కాగా ఈ ఏడాది 1606 కేసులు నమోద య్యాయి. ప్రజలకు గ్రామ స్థాయిలో ఏ.ఎన్.ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది ఒక్క మరణం లేక పోవడంతో పాటు వ్యాధి ఉధృతి ఏటేటా తగ్గు ముఖం పడుతుంది.

శాఖ పరమైన కార్యకలాపాలు గురించి ఏమైనా చెప్తారా ?

క్షయ వ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా వైద్యుని సలహా మేరకు చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాగించవచ్చు. అదేవిధంగా ప్రస్తుతం 60 ఏళ్ల పైబడిన వారికి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న బిసిజి వ్యాక్సిన్ పై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ వేయించుకోవాలి. పల్నాడు జిల్లాలో మొదటి విడత 5 లక్షల టీకాలు లక్ష్యం కాగా ఇప్పటికి 1,20,979 మందికి ఇవ్వడం జరిగింది. బిసిజి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో క్షయ వ్యాధి రాదన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా